

శుక్రవారం తన నివాసానికి వచ్చిన సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కారత్, సీతారాం ఏచూరీ, బీవీ రాఘవులుతో తెదేపా అధినేత చంద్రబాబు

# 18న లోక్‌సభ రద్దు!

- జయలలిత నాతో చెప్పారు
- చంద్రబాబు వెల్లడి
- వారంలో తేలుతుంది
- కారత్, ఏచూరి, రాఘవులు వ్యాఖ్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని తెదేపా, వామపక్షాలు నిర్ణయించాయి. లోక్‌సభను రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతోందని, వారం రోజుల్లో ఎన్నికలపై స్పష్టత వస్తుందని అభిప్రాయపడినట్లు తెలిసింది. సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కారత్, పొలిట్‌బ్యూరో సభ్యులు సీతారాం ఏచూరి, రాఘవులు శుక్రవారమిక్కడ చంద్రబాబుతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జాతీయ రాజకీయాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది. 'ఢిల్లీ వెళ్లినప్పుడు జయలలితతో ఫోన్‌లో మాట్లాడాను. ఈనెల 18న లోక్‌సభను రద్దు చేయవచ్చని వారి ఎంపీలు తెలిపినట్లు ఆమె నాకు చెప్పారు' అని ఈ సందర్భంగా చంద్రబాబు వెల్లడించినట్లు సమాచారం. ఉగ్రవాదంపై లోక్‌సభలో చర్చ ముగిసిన తరువాత ఎన్నికలపై కొంత స్పష్టత వస్తుందని కారత్ వివరించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై కొద్దిసేపు చర్చ జరిగింది.

## ఐదేళ్ల తర్వాత బాబు నివాసానికి రాఘవులు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బీవీ రాఘవులు దాదాపు ఐదేళ్ల తర్వాత చంద్రబాబు నివాసానికి వచ్చారు. గతంలో చంద్రబాబుపై అలిపిరి వద్ద మావోయిస్టుల దాడి జరిగినప్పుడు ఆయన్ను పరామర్శించేందుకు రాఘవులు వెళ్లారు. తర్వాత పార్టీ అగ్రనేతలు కారత్, ఏచూరి పలుసార్లు చంద్రబాబు నివాసంలో భేటీ జరిపినా రాఘవులు మాత్రం వెళ్లలేదు.